సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



శ్రీనివాసా.. చిరుమందహాసా..


కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి దివ్యక్షేత్రంలో శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. - 8లో



రూ.3,32,472 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నల్లం వెంకట దుర్గాప్రసాద్ దంపతులు (రాజమహేంద్రవరం) శనివారం రూ. 3,32,472 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 6,250 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,850, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,200 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.65 అడుగులకు చేరింది.

రాజమహేంద్రవరం
ఇఫ్తార్ - సెహరీ
ఆదివారం (సా॥) 6:25 - సోమవారం (ఉ॥) 4:34
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఒంటిపూట బడులు

రాయవరం: పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ విపత్తుల నిర్వహణ విభాగం జారీ చేసిన సూచనలకు అనుగుణంగా వాతావరణ నివేదికను దృష్టిలో ఉంచుకుని, ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ హాఫ్ డే స్కూల్స్ అమలు చేయనున్నారు. జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్, గుర్తింపు పొందిన అన్‌ఎయిడెడ్ పాఠశాలలన్నీ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నెల రెండో శనివారాన్ని కూడా పనిదినంగానే పాటించాల్సి ఉంది. పాఠశాల ముగిసిన అనంతరం మధ్యాహ్న భోజనం అందజేసిన తర్వాత విద్యార్థులను ఇళ్లకు పంపించాలి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలు హాఫ్ డే స్కూల్స్‌ను కచ్చితంగా పాటించాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ విద్యా సంచాలకులు జి.నాగమణి సూచించారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: రత్నగిరికి శనివారం వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. సత్యదేవుని సుమారు 30 వేల మంది దర్శించి, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడం ప్రారంభించారు. రెండు వేల వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 5 వేల మందికి నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు. ఏకాదశి పర్వదినం కావడంతో స్వామి, అమ్మవార్లకు ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన చేశారు. 9 నుంచి 11 గంటల వరకూ లక్ష తులసి పూజ చేశారు.

నేడు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం

సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేయనున్నారు. దీనిని తిలకించేందుకు రూ.3 వేల టికెట్‌పై 20 జంటలను అనుమతించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోపల, వెలుపల చెరో పది జంటల చొప్పున కూర్చునేలా బెంచీలు ఏర్పాటు చేశారు. వెనుక కూర్చున్న వారు కూడా స్వామివారి అభిషేకాన్ని చక్కగా చూసేలా బెంచీలను అమర్చారు.

కిక్కిరిసిన అప్పనపల్లి ఆలయం



బాలబాలాజీ స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచే అనేకమంది పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఉభయ దేవేరులతో కొలువు దీరిన స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.2.81 లక్షలు ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.91 లక్షల ఆదాయం వచ్చింది. ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.90,495 విరాళంగా సమర్పించారు. స్వామివారిని 3,975 మంది దర్శించుకోగా 3,561 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఉద్యోగులు పర్యవేక్షించారు.

పదిలో తలమునకలు

- రేపటి నుంచే టెన్త్ పరీక్షలు
- పక్కా ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీ
- ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి

రాయవరం: ఇక ఒక్క రోజు మాత్రమే గడువు ఉండటంతో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లలో అధికారులు తలమునకలవుతున్నారు. పరీక్షల నిర్వహణలో అతి ముఖ్యమైన ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేశారు. వారి జాబితాలను విద్యాశాఖ అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి, ఖరారు చేశారు. ఎస్‌జీటీలకు సంబంధించిన జాబితాను మండల విద్యాశాఖాధికారులకు, స్కూల్ అసిస్టెంట్ల జాబితాను పాఠశాల హెచ్ఎంలకు పంపించారు. మరోవైపు ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఉపాధ్యాయుల మొబైల్ ఫోన్లకు విద్యాశాఖ నుంచి మెసేజ్‌లు కూడా పంపిస్తున్నారు. ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఎస్‌జీటీలను ఎంఈఓలు, స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయనున్నారు. పరీక్షల నిర్వహణపై అధికారులు శనివారం అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రథమ చికిత్సకు ఏర్పాట్లు

అవసరమైతే విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించేందుకు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. సమీప పీహెచ్‌సీలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న ఏఎన్ఎం, ఆశ వర్కర్‌ను నియమించి, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. పరీక్షలు జరిగే ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ సిబ్బంది అందుబాటులో ఉంటారు. వారికి కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదు.

విద్యార్థులకు సూచనలివీ..

- విద్యార్థులు విధిగా హాల్ టికెట్‌ను తమ వెంట తీసుకు వెళ్లాలి. లేకుంటే పరీక్షకు అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలో ప్రవేశించే అభ్యర్థులు పరీక్షకు సంబంధించిన పుస్తకాలు, పేపర్లు వెంట తీసుకు వెళ్లరాదు. అలా కలిగి ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ఇయర్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లరాదు.
- 24 పేజీల సమాధానాల బుక్‌లెట్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి.
- పద పరిమితిని కచ్చితంగా పాటించాలి. సమాధానాల నాణ్యత ఆధారంగా మార్కులు ఇస్తారు.
- సైన్స్ పరీక్షలో ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి విడివిడిగా ఓఎంఆర్‌లు ఉన్న రెండు 12 పేజీల సమాధానాల బుక్‌లెట్లు ఒకేసారి అందిస్తారు. ఫిజికల్ సైన్స్ బుక్‌లెట్‌లో దానికి సంబంధించినవి, నేచురల్ సైన్స్ బుక్‌లెట్‌లో ఆ సబ్జెక్టు సమాధానాలు మాత్రమే రాయాలి.
- పరీక్షల సమయంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా తదుపరి పరీక్షలకు అనుమతించరు.
- ముందు రాసిన పరీక్షల ఫలితాలు వెల్లడించరు.
- అభ్యర్థి పేరు, రోల్ నంబరు, ఇతర వివరాలను 24 పేజీల బుక్‌లెట్, మ్యాప్, గ్రాఫ్ షీట్‌లోని ఏ పేజీలోనూ రాయకూడదు.

తల్లిదండ్రులు/సంరక్షకులకు సూచనలివీ..

- ఒక రోజు ముందే సంబంధిత కేంద్రాన్ని తల్లిదండ్రులు/సంరక్షకులు సందర్శిస్తే పరీక్ష ప్రారంభం రోజున అక్కడకు సులువుగా చేరుకోవచ్చు.
- అభ్యర్థుల్లో ఆందోళన, భయం కలిగించే వదంతులు నమ్మరాదు.
- రాత్రి పూట ఎక్కువ సమయం చదవాల్సిందిగా పిల్లలపై ఒత్తిడి చేయరాదు.
- ఆందోళన, ఉద్రిక్తత నివారణకు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8.45 గంటలు, అంతకంటే ముందుగానే చేరుకోవాలి.
- పరీక్ష కేంద్రానికి అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, స్కేలు తదితర స్టేషనరీ తప్పకుండా తీసుకు వెళ్లేలా చూసుకోవాలి.
- పరీక్ష కేంద్రంలో ఇతర అభ్యర్థులతో మాట్లాడవద్దని, దుష్ప్రవర్తనలకు పాల్పడవద్దని పిల్లలను హెచ్చరిస్తే మంచిది.

ప్రతి కేంద్రంలో కనీసం ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 373 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3,429 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కనీసం ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారి (డీఓ) నియామకం చేపట్టారు. పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న కేంద్రాల్లో అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులను (ఏడీఓ) కూడా నియమించారు. కాకినాడ జిల్లాలో 20, తూర్పు గోదావరిలో 23, కోనసీమ జిల్లాలోని 10 పరీక్ష కేంద్రాల్లో ఏడీఓలను నియమించారు.


జిల్లాల వారీగా ఇన్విజిలేటర్లను నియమించారిలా..

జిల్లా	పరీక్ష కేంద్రాలు	ఇన్విజిలేటర్లు
కోనసీమ	111	1,092
తూర్పు గోదావరి	126	852
కాకినాడ	136	1,485



రామచంద్రపురం పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న సీఎస్ శ్రీనివాసరెడ్డి

ఎవ్వరికీ మినహాయింపు లేదు



పరీక్షల విధులకు నియమించిన వారిలో ఏ ఒక్కరికీ మినహాయింపు ఇచ్చే ప్రసక్తి లేదు. ఏదైనా బలమైన కారణాలుంటే తప్ప మినహాయింపు ఉండదు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకూ తావు లేకుండా ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించాలి.

– ఎస్ఏ అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పు గోదావరి

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గంజాయి, మాదక ద్రవ్యాల రహితంగా జిల్లాను తీర్చిదిద్దుదామని కలెక్టర్ కె.మాధవీలత, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి జాతీయ ఔషధ డిమాండ్ తగ్గింపు (ఎన్‌సీఓఆర్‌డీ) కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలను విక్రయించే వారిపై కేసులు పెట్టడంతో పాటు వారి, వారి బంధువుల ఆస్తులను కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. ఆర్థిక లావాదేవీలపై మరింత నిఘా పెట్టడంతో పాటు ఆయా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తామని అన్నారు. వీలైనంత త్వరగా అన్ని కెమిస్ట్‌లు, ఫార్మసీ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నషా ముక్త్ భారత్ కింద నషాముక్త్ పంచాయతీ అనే కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాలు పండించడం నుంచి వినియోగించడం వరకూ ప్రతి ప్రాంతాన్నీ గుర్తించి, వాటి నియంత్రణ పద్ధతులు సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దు ప్రవేశ ప్రాంతాల వద్ద ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సూచించారు. 2019 నుంచి గత నెలాఖరు వరకూ జిల్లాలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద 215 కేసులలో 699 మందిని అరెస్టు చేశామని, రూ.9.45 కోట్ల విలువైన 20,587 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 156 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, ఎస్ఈబీ అధికారి వి.సోమశేఖర్, ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, జిల్లా వ్యవసాయ, పోలీసు, ఇంటర్మీడియెట్ ఇన్‌స్పెక్షన్, అటవీ, డ్రగ్స్ అధికారులు ఎస్.మాధవరావు, ఎస్పీ నక్వీ, ఎస్ఎస్‌పీఎల్ నరసింహం, నాగరాజు, నాగమణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సుధీర్ కుమార్

ప్రసాదం కౌంటర్ ఉద్యోగి రమేష్ సస్పెన్షన్

అన్నవరం: జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సీహెచ్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రసాదం కౌంటర్‌ను సూపరింటెండెంట్ ఐవీ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేయగా, ప్రసాదం విక్రయాల నగదు రూ.16 వేలు తక్కువగా ఉంది. ఆ నగదును రమేష్ సొంతానికి వాడుకున్నట్టు తేలడంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారని రామారావు శనివారం తెలిపారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక పింఛన్ల పంపిణీ సోమవారం ప్రారంభమవుతుందని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు. జిల్లాలోని 2,35,242 మంది పెన్షన్‌దారులకు ప్రభుత్వం రూ.64.84 కోట్లు విడుదల చేసిందన్నారు. వేలిముద్రలు పడని అవ్వాతాతలకు ఆధార్ ముఖ గుర్తింపుతో ఐదు రోజుల పాటు పింఛన్లు అందజేస్తామని తెలిపారు.

చెప్పారంటే.. చేస్తారంతే..



ద్వాక్రా మహిళలకు నమునా చెక్కు అందజేస్తున్న మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్



సదస్సుకు తరలివచ్చిన మహిళలు

- అదే సీఎం జగన్ నైజం
- హోం మంత్రి తానేటి వనిత
- ఎంపీ మార్గాని భరత్‌తో కలసి ఆసరా నమూనా చెక్కు పంపిణీ

కొవ్వూరు: ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా మూడో సంవత్సరం కూడా డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మూడో విడత రుణమాఫీ సొమ్ము అందించారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో మోసం చేస్తే.. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామని ప్రకటించి క్రమం తప్పకుండా అమలు చేస్తోందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారంటే చేస్తారనే నమ్మకాన్ని కల్పించారని కొనియాడారు. మన బిడ్డల చదువుల కోసం మేనమామ మాదిరిగా బాధ్యత తీసుకుని అమ్మ ఒడి పథకం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అలాగే మహిళల సాధికారతే లక్ష్యంగా రుణమాఫీతో పాటు సున్నా వడ్డీ, చేయూత, కాపునేస్తం, అగ్రవర్ణ పేదలకు ఈబీసీ నేస్తం, మహిళల పేరుతోనే ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇస్తున్నారని వివరించారు. మహిళా పక్షపాతిగా పని చేస్తున్న ముఖ్యమంత్రికి అండదండగా ఉండాలని మంత్రి వనిత కోరారు.

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. సీఎం జగన్ అమ్మ ఒడి, చేయూత, రుణమాఫీ వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తూ పేదలను పైకి తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. 'మన ఇంట్లో అమ్మాయి పెళ్లి చేయాలంటేనే వంద రకాలుగా ఆలోచిస్తాం. అటువంటిది రాష్ట్రంలో మనం, మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలి. మహిళలను మోసం చేసిన చంద్రబాబును, ఈ రోజు వస్తే మళ్లీ రెండు నెలల వరకూ రాష్ట్రానికి రాని పవన్ కల్యాణ్‌ను నమ్మవద్దు' అని విజ్ఞప్తి చేశారు.

పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. అనంతరం మండలంలోని 1,367 డ్వాక్రా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా కింద మంజూరైన రూ.10,10,80,380 నమూనా చెక్కును మంత్రి వనిత, ఎంపీ భరత్‌రామ్ చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. నలుగురు ఆపద మిత్రలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కాట్రు అనితశ్రీ, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి తదితరులు కూడా ప్రసంగించారు.

క్లుప్తంగా

పోస్టల్ నిధుల గోల్‌మాల్‌పై సీబీఐ విచారణ

అమలాపురం టౌన్: విలస పోస్టాఫీస్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) నిధులు రూ.1.18 కోట్లు గోల్‌మాల్ కేసుకు సంబంధించి విశాఖపట్నం సీబీఐ అధికారులు ఐదు రోజుల పాటు అమలాపురంలోనే ఉండి విచారణ చేశారు. సీబీఐ దర్యాప్తు బృందం తొలి దఫా విచారణ ముగించుకుని శుక్రవారం రాత్రి పొద్దుపోయాక వారు స్వాధీనం చేసుకున్న రికార్డులు, సేకరించిన ఆధారాలను వెంట బెట్టుకుని తిరిగి విశాఖపట్నానికి బయలుదేరి వెళ్లారు. ఐదు రోజుల్లో ఈ కేసులో బాధ్యులైన నలుగురు పోస్టల్ ఉద్యోగులను అమలాపురం హెడ్ పోస్టాఫీసులో విచారించారు. గోల్‌మాల్ సూత్రధారి సతీష్‌ను వరుసగా రెండు రోజులు విచారించారు. సీబీఐ బృందం మరికొద్ది రోజుల్లో మరోసారి అమలాపురం హెడ్ పోస్టాఫీస్‌కు వచ్చి ఈ నిధుల దుర్వినియోగంలో షోకాజ్ నోటీసులు అందుకున్న ఎనిమిది మంది పోస్టల్ ఉద్యోగులను విచారించనుందని తెలిసింది.

170 సెల్‌ఫోన్ల అప్పగింత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చోరీకి గురైన, పోగొట్టుకున్న 170 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. దీనిపై స్థానిక దిశ పోలీస్ స్టేషన్‌లో శనివారం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి ఏర్పాటు చేసిన చాట్ బాట్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వాటిని పట్టుకుని బాధితులకు అప్పగిస్తున్నామని తెలిపారు. రెండో విడతగా 170 ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామన్నారు. ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్న వారు 9493206459 వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేసి వివరాలు అందిస్తే ఫిర్యాదు నమోదవుతుందన్నారు. అడిషనల్ ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసా... చిరుమందహాసా



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

- నయనానందకరంగా కోనేటి రాయుడి కల్యాణం
- భక్తులతో శోభిల్లిన వాడపల్లి క్షేత్రం

ఆత్రేయపురం: అభయమొసంగ శ్రీవారు వచ్చారు.. శంఖచక్రధారిగా చిరుమందహాసంతో దర్శనమిచ్చారు.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా అంటూ భక్తులు తన్మయత్వంతో కొలిచారు. గౌతమీ నదీ తీరాన వెలసిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కోనేటి రాయుడి కల్యాణ మహోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. శనివారం రాత్రి 7–01 గంటలకు ఈ రమణీయ ఘట్టాన్ని నిర్వహించారు. అత్యంత సుందరంగా అలంకరించిన కల్యాణ మండపంలో పట్టువస్త్రాలు, సర్వాభరణాలతో ముస్తాబైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ వేడుకను కడు రమణీయంగా నిర్వహించారు. భక్తజనం తన్మయత్వంతో కల్యాణ వేడుకలను తిలకించారు. ఈ వేడుకలతో వాడపల్లి క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజాదికారులు నిర్వహించారు. కల్యాణ మండపానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండంలో భక్తులు హారతి కర్పూరాలను భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ఈ వెలుగుల్లో వేంకటేశ్వర స్వామి అమ్మవార్లకు అర్చకుల వేదమంత్రోచ్చారణలతో వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం చైత్రశుద్ధ ఏకాదశి శుభముహూర్తం రాత్రి 7–01 గంటలకు కల్యాణాన్ని జరిపించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నడిపూడికి చెందిన వేదపండితుడు ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చక బృందం సభ్యులు పూజాదికాలు చేశారు. పంచద్రవ్యాలు, పరిమళాలు వెదజల్లే పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణ వేడుకలు జరిగాయి.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుందరంగా అలంకరించి..

తొలుత భరద్వాజ గోత్రీయుడు వేంకటేశ్వరస్వామి, భార్గవ గోత్రవతి శ్రీదేవి, కాశ్యపస గోత్రవతి భూదేవిల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు, వెండి వజ్రాభరణాలతో సుందరంగా అలంకరించారు. తొలుత గర్భగుడి నుంచి కల్యాణ వేదికకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి రథోత్సవం మాడ వీధుల్లో కన్నుల పండువగా జరిగింది. రావులపాలేనికి చెందిన, ఆలయ కమిటీ సభ్యులు మన్యం నాగవెంకట సూర్యకుమారి, భాను దంపతులు ముత్యాల తలంబ్రాలను సమకూర్చగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ముత్యాల తలంబ్రాల కార్యక్రమం వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దంపతులు

పేపరు మిల్లు ఉద్యోగి ఆత్మహత్య

- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



పేపరు మిల్లు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పేపరు మిల్లులో ఉద్యోగం ఇప్పించే విషయంలో వేధింపులకు గురైన ఓ వ్యక్తి మనస్తాపంతో శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పేపరు మిల్లు ఉద్యోగుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం పేపరు మిల్లు స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న రమణమ్మ.. తన ఉద్యోగాన్ని వీరబాబు అనే వ్యక్తికి ఇచ్చేందుకు గతంలో రూ.14 లక్షలకు అంగీకారం కుదుర్చుకుంది. వీరిద్దరికీ రాజానగరం మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన సంగిత సత్యనారాయణ (58) మధ్యవర్తిగా ఉన్నాడు. అతడు కూడా పేపరు మిల్లు స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా, ఉద్యోగం కోసం పూర్తి సొమ్ము తీసుకున్న రమణమ్మ కొద్ది కాలం కిందట చనిపోయింది. దీంతో వీరబాబుకు పేపరు మిల్లులో ఉద్యోగం రాలేదు. ఈ నేపథ్యంలో తాను ఇచ్చిన రూ.14 లక్షలూ తిరిగి ఇవ్వాలని మధ్యవర్తిగా ఉన్న సత్యనారాయణను వీరబాబు పలుమార్లు అడిగాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన సత్యనారాయణ పేపరు మిల్లులోని స్టోర్స్ విభాగంలో షెడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు వీరబాబు, రమణమ్మ చెల్లెలు భవాని, రమణమ్మ తమ్ముడు సత్యనారాయణ కారణమని రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు మృతుడి జేబులో లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మాటికి హత్యే : ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సత్యనారాయణది ఆత్మహత్య కాదని, ఒక రకమైన హత్య అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. సత్యనారాయణ మృతి సమాచారం తెలిసిన వెంటనే ఆయన హుటాహుటిన మిల్లుకు చేరుకున్నారు. ఉరికి వేలాడుతున్న సత్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పోలీసు అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పేపరు మిల్లులో ఉద్యోగాలు అమ్ముకోవడమనే వికృత పరంపరకు తెర లేపిన మిల్లులోని కొందరు ఉన్నతోద్యోగులు, కార్మిక నేతలు, ప్రజాప్రతినిధులు సత్యనారాయణపై మానసిక ఒత్తిడి తీసుకురావడం వల్లే ఈ దారుణం చోటు చేసుకుందన్నారు. వారందరూ ఈ మృతికి బాధ్యత వహించాలన్నారు. చేయని నేరానికి అన్యాయంగా బలైపోయిన సత్యనారాయణ కుటుంబానికి పేపరు మిల్లు యాజమాన్యం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, అతడి కుటుంబ సభ్యులకు మిల్లులో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు తెలివిగా ఉద్యోగాలు అమ్ముకునే వ్యవహారాల్లో సీనియర్ ఉద్యోగులను ఇరికించి, తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. ఆత్మహత్యతో సత్యనారాయణ వ్యవహారం వెలుగు చూసిందని, మిల్లులో ఇంకా ఎందరో ఉద్యోగులు ఇలా తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని, బెదిరింపుల కారణంగా వారు తమ బాధను బహిర్గతం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. సత్యనారాయణను సైతం ఇలాగే ఇరికించారన్నారు. నగదు చేతులు మారి, కొనుగోలు చేసిన వ్యక్తికి ఉద్యోగం రాకముందే అనారోగ్యం కారణంగా మహిళా ఉద్యోగి చనిపోయిందని, దీంతో సదరు ఆర్థిక లావాదేవీలతో ఏమాత్రం సంబంధం లేని సత్యనారాయణపై ఒత్తిడి తెచ్చి, బలి తీసుకున్నారని ఆరోపించారు. అలాగే సత్యనారాయణ రాజీనామా చేస్తే, ఆ ఉద్యోగం సదరు కొనుగోలు చేసిన వ్యక్తికి వస్తుందంటూ కొందరు ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు ఒత్తిడి చేసినట్టు మృతుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఇది ముమ్మాటికీ హత్యేనని రాజా ఆరోపించారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని, సత్యనారాయణ ఆత్మహత్యకు కారకులైన ఫ్యాక్టరీ ఉన్నతోద్యోగులు, కార్మిక నేత ముసుగులో ఉన్న వ్యక్తులు, ప్రజాప్రతినిధులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



మృతుడు సత్యనారాయణ (ఫైల్)

వైభవంగా శృంగార వల్లభస్వామి కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: తొలి తిరుపతిలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి దివ్య కల్యాణం శనివారం రాత్రి అత్యంత వైభవోపేతంగా జరిగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణలతో తొలి తిరుపతి గ్రామం మార్మోగింది. వందలాదిగా దంపతులు పీటలపై ఆశీనులు కాగా, స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ నుంచి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. జిల్లా దేవదాయ అధికారి, ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఉభయ దేవేరులైన లక్ష్మీదేవి, భూదేవులతో స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర కార్మిక సంఘ నాయకులు దవులూరి సుబ్బారావు తదితరులు విడివిడిగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఉత్సవాల సందర్భంగా భారీగా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్పులు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ కర్రి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

- 182 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు
- డీటీపీవో శ్రీనివాసరావు వెల్లడి



డీటీపీవో శ్రీనివాసరావు

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏపీఎస్ ఆర్టీసీలో 182 కారుణ్య నియామకాలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు పేరుతో శనివారం ఉత్తర్వులు వచ్చాయి. ఆ వివరాలను కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు శనివారం విలేకర్లకు వివరించారు. 2016 జనవరి 1వ తేదీ నుంచి 2019 జనవరి 31వ తేదీ వరకూ మరణించిన వివిధ కేటగిరీ ఉద్యోగులకు సంబంధించి మొత్తం 182 పోస్టులను కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్–8 (డిగ్రీ విద్యార్హత), ఆర్టీసీ కానిస్టేబుల్–15 (ఎస్ఎస్‌సీ పాస్- శారీర దారుఢ్యం), కండక్టర్లు–24 (టెన్త్), డ్రైవర్లు–102 (8వ తరగతి–18 నెలల లైసెన్స్), అసిస్టెంట్ మెకానిక్–33 (ఐటీఐ లేదా టెన్త్), అర్హత ఉన్న కుటుంబ సభ్యులు ఆయా జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంటుంది. ఓసీలకు 34 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల సడలింపు ఇచ్చారు. ఇక మరణించిన ఉద్యోగి భార్యకు అయితే 45 ఏళ్ల వయో పరిమితిగా మార్చారు. ఈ మేరకు అర్హత కలిగిన ఉద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని, త్వరలోనే ఆయా పోస్టులను ప్రభుత్వం ద్వారా భర్తీ చేస్తామని డీటీపీవో చెప్పారు.

త్వరలోనే నాఫెడ్ కొనుగోలు కేంద్రాలు

అంబాజీపేట: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తామని ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు చెప్పారు. శనివారం అంబాజీపేట మార్కెట్ యార్డులో కొబ్బరి వ్యాపారులు, రైతులతో జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో మిల్లింగ్ కోప్రకు రూ.10,590, బాల్ కోప్రకు రూ.11 వేల మద్దతు ధర ఉండేదన్నారు. ఇప్పుడు మిల్లింగ్ కోప్రకు రూ.10,860, బాల్ కోప్రకు రూ.11,750 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొబ్బరి తయారు చేసే రైతులు తమ వివరాలను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. అలాగే రైతులు నేరుగా మార్కెట్ కమిటీలో సంప్రదించి వాటి వివరాలు తెలియజేయాలని అన్నారు.

రైస్‌మిల్లులో ప్రమాదం

వ్యక్తి మృతి, నలుగురికి తప్పిన ప్రమాదం

యానాం: రైసుమిల్లులో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లరేవు మండల పరిధి గోవలంక గ్రామానికి చెందిన కోరుకొండ జగన్నాథరావు (48) దరియాలతిప్పలోని గాయత్రి రైసు మిల్లులో లారీ క్లీనర్‌గా పదేళ్లుగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం రైస్‌మిల్లులోని ధాన్యం బస్తాలు మోసుకెళ్లే కన్వేయర్ బెల్ట్ టైర్‌మిషన్ మరమ్మతులకు గురవడంతో దానిని బాగుచేయాలని యాజమాన్యం జగన్నాథరావుతో పాటు మిగిలిన నలుగురు కార్మికులకు చెప్పింది. అయితే జాకీతో కన్వేయర్ బెల్ట్ బోల్టులు విప్పి మరమ్మతులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇనుప కన్వేయర్ టైర్ ఒకవైపునకు పడిపోయింది. దీని కిందపడి జగన్నాథరావు మృతి చెందాడు. మరో నలుగురు జట్టు కార్మికులు పక్కకు వెళ్లడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతుడు జగన్నాథరావు మృతదేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్చురీలో భద్రపరిచారు. తమ సహచరుడు జగన్నాథరావు మృతితో అధిక సంఖ్యలో రైసుమిల్లు కార్మికులు, గోవలంక గ్రామస్తులు ఆసుపత్రికి తరలివచ్చారు. ప్రమాదానికి కారణమైన గాయత్రి రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం యానాం పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. టెక్నీషియన్లు చేయాల్సిన పనిని లారీ క్లీనర్‌గా ఉన్న జగన్నాథరావుకు అప్పగించడం వల్లే చనిపోయాడని మృతుడి అన్నయ్య సత్యనారాయణ అన్నారు.



మృతిచెందిన జగన్నాథరావు